క్లుప్తంగా

మండల వ్యవసాయాధికారికి సన్మానం



ఏఓ జ్యోతిని సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

ఏలేశ్వరం: మండల వ్యవసాయాధికారి బి.జ్యోతిని బుధవారం ఘనంగా సన్మానించారు. వ్యవసాయాధికారి జ్యోతికి బదిలీపై సామర్లకోటకు వెళుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీఓ సూర్యనారాయణ ఆమెకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యవసాయాధికారిగా జ్యోతి సేవలు ప్రశంసనీయమన్నారు. రైతులకు ఆమె మెరుగైన సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య సేవలు



రౌతులపూడి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

రౌతులపూడి: డయేరియా సోకిన ఏజెన్సీ ప్రాంతాల్లో బుధవారం కూడా వైద్య సేవలు కొనసాగించారు. సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతాలైన రాఘవపట్నం శివారు దబ్బాది, సత్యవరం, సార్లంక గ్రామాలకు చెందిన 38 మంది డయేరియా బాధితులకు రౌతులపూడి సీహెచ్‌సీలో మూడు రోజులుగా చికిత్స అందిస్తున్నారు. వీరికి బుధవారం కూడా వైద్యసేవలు కొనసాగాయి. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. పూర్తిగా కోలుకునే వరకు ఆసుపత్రిలోనే ఉండాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు.

సీనియర్ భజన కళాకారుడి మృతి

ప్రత్తిపాడు రూరల్: భజన కళాకారుడు గుండెపోటుతో కన్నుమూశారు. గ్రామానికి చెందిన సీనియర్ భజన కళాకారుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ శాలివాహన సంఘ గౌరవ అధ్యక్షుడు స్వయంభూపు పైడితల్లి(73) గురువారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పైడితల్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుమారుడు త్రినాథ్, శ్రీను జోగినాదంను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా వాణిజ్య మండలి అధ్యక్షుడు ఇంధన యేసు బాబు, రంగస్థల కళాకారుడు, ధ్యాన మండలి అధ్యక్షుడు దొడ్డిపట్ల సోమన్న దొర, మాజీ సొసైటీ అధ్యక్షుడు జువ్వల చినబాబు, కళాకారుడు సానా తాతీలు, చుక్కల సత్యనారాయణ తదితరులు పైడితల్లి భౌతికకాయని సందర్శించి నివాళులర్పించారు.

పగలే వెలుగులు



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్ రోడ్డులో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

ప్రత్తిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే విద్యుత్ వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధి దీపాల నిర్వాహణను పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుద్దీపాలకు ప్రత్యేకంగా మూడో లైన్ లేకపోవడం, నూతన లైన్ ఏర్పాటు చేయకపోవడం, ఫ్యూజ్ క్యారియర్లు, స్విచ్‌లు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల పంచాయతీలపై విద్యుత్ బిల్లు రూపంలో అదనపు భారం పడుతోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, వీధి లైట్ల వెలుగులను క్రమబద్ధీకరించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప సభ

గోకవరం: ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల సుపరిపాలనపై వికసిత్ భారత్ సంకల్ప సభ కార్యక్రమాన్ని గోకవరం సూర్య కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు మాల కొండయ్య హాజరైయ్యారు. తొలిత నాయకులు అందరూ కలసి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 ఏళ్ల పరిపాలనలో నరేంద్ర మోడీ ఎన్నో విజయాలు సాధించి, మన దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీ వరాలబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మట్ట మంగరాజు, జి.కొండలరావు, డి.సూర్యనారాయణరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సత్తి వెంకట్ రెడ్డి, అసెంబ్లీ కో-కన్వీనర్ కోన వెంకట సురేష్, రైల్వే బోర్డు మెంబర్ బత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంపా గేట్లకు మరమ్మతులు

- రంగం సిద్ధం చేసిన అధికారులు
- రెండు రోజుల్లో పనులు ప్రారంభం
- గేట్లను పరిశీలించిన నిపుణులు
- విపత్తు రక్షణ నిధుల నుంచి రూ.3.36 కోట్ల విడుదల
- గేట్ల మరమ్మతులకు ఏర్పాట్లు పూర్తి: పంపా డీఈఈ



పంపా రిజర్వాయర్

అన్నవరం: స్థానిక పంపా బ్యారేజీ గేట్ల మరమ్మతులకు రంగం సిద్ధమైంది. రెండు రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్టు రిజర్వాయర్ అధికారులు బుధవారం తెలిపారు. పంపా బ్యారేజీకి ఐదు గేట్లు ఉన్నాయి. వీటిలో అత్యంత సమస్యాత్మకంగా ఉన్న నాలుగో నంబర్ గేటుకు వచ్చే నెలాఖరులోగా మరమ్మతులు పూర్తి చేస్తారు. తరువాత ఖరీఫ్‌కు నీటిని విడుదల చేస్తారు. మిగిలిన నాలుగు గేట్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నారు. ఖరీఫ్ అనంతరం వాటి మరమ్మతులు కూడా పూర్తి చేస్తారు. ఒక వేళ పంపా ఆయకట్టులో రబీ పంటకు కూడా నీరు విడుదల చేస్తే ఆ పంట అనంతరం పనులు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే నిధులు కేటాయింపు

వరదల సమయంలో మిగులు నీటిని సముద్రానికి విడుదల చేసే సమయంలో పంపా బ్యారేజీ గేట్లు నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. గేట్లు ఎత్తి, దించేందుకు చాలా సమయం పడుతుండడంతో



మరమ్మతులు చేసేందుకు పైకి ఎత్తిన గేట్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023 జూలైలో నిధులు కేటాయించాలని నిర్ణయించింది. ఇందు



పంపా గేట్లు మరమ్మతుల గురించి చర్చిస్తున్న నిపుణుడు సారథి, పంపా అధికారులు

కోసం రూ.3.36 కోట్లు అవసరమని అంచనా వేశారు. అయితే అప్పుడు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాయిదా పడింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 2024 డిసెంబర్‌లో నిధులు విడుదల చేసింది.

ఎట్టకేలకు గేట్లు మరమ్మతులకు టెండర్ ఖరారు

పంపా బ్యారేజీ గేట్లు మరమ్మతులకు గాను గత జనవరిలో తొలిసారిగా రూ.3.36 కోట్లు అంచనా వ్యయంతో టెండర్ పిలిచారు. అయితే టెండర్ నిబంధనలు కఠినంగా ఉండడంతో ఎవరూ వేయకపోవడంతో రెండోసారి పిలిచారు. అప్పుడూ రాకపోవడంతో కొన్ని నిబంధనలు సడలించి గత ఏప్రిల్‌లో మూడోసారి టెండర్ వేశారు. కొవ్వూరుకు చెందిన గోపాల్‌కృష్ణ ఏజెన్సీ టెండర్‌ను దక్కించుకుంది.

గేట్ల పరిశీలన

పంపా బ్యారేజీ గేట్లకు చేయాల్సిన మరమ్మతుల గురించి అధికారులతో కలిసి గేట్లు నిపుణుడు సారథి పంపా గేట్లు మంగళవారం పరిశీలించారు. తొలుత నాలుగో నంబర్ గేటు మరమ్మతు చేయాల్సి ఉన్నందున అందుకు అవసరమయ్యే 200 టన్నుల కెపాసిటీ గల క్రేన్, ఇతర యంత్రాలు, పనిముట్లను బ్యారేజీ గేట్లు వద్దకు తీసుకువచ్చేందుకు గల మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు ఆదేశాల మేరకు పంపా గేట్ల మరమ్మతు పనులు రెండు రోజుల్లో ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని పంపా డీఈఈ సంతోష్ కుమార్ బుధవారం సాక్షికి తెలిపారు.



87 అడుగులకు చేరిన నీటిమట్టం

ఇదీ రిజర్వాయర్ పరిస్థితి

పంపా రిజర్వాయర్ కింద తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 12,500 ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. ఒక సారి ఆయకట్టు మొత్తం సాగవ్వాలంటే 1.5 టీఎంసీల నీరు అవసరం. పంపా నదీ గర్భం నుంచి పుష్కర కాలువ నిర్మాణం జరుగక ముందు పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 105 అడుగులు ఉండేది. 105 అడుగులకు నీటిమట్టం చేరితే 0.5 టీఎంసీలు నీరు నిల్వ ఉంటుంది. అయితే పుష్కర కాలువ రిజర్వాయర్‌కు 103 అడుగుల ఎత్తులో నిర్మించిన తరువాత రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 103 అడుగులకు అంటే 0.44 టీఎంసీకి పరిమితం చేశారు. దీంతో ఖరీఫ్ పంట కాలంలో నాలుగు సార్లు పంపా నిండితే తప్ప ఖరీఫ్ గట్టెక్కని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పంటా రిజర్వాయర్ నీటిమట్టం 87 అడుగుల వద్ద స్థిరంగా ఉంది. గత మార్చి నెలలో 78 అడుగుల డెడ్ లెవల్‌కు నీటి మట్టం పడిపోయింది. అయితే ఆ తరువాత అడపా తడపా వర్షం కురుస్తుండడంతో నీటి మట్టం పెరిగి 78 అడుగులకు చేరింది.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



రౌతులపూడిలో జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని పార్టీ శ్రేణులతో కలసి ఆవిష్కరిస్తున్న గిరిబాబు

రౌతులపూడి: ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. జగన్ అంటే నమ్మకం-బాబు అంటే మోసం పుస్తకాలను మండల పార్టీశ్రేణులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏడాది అంతా కుంటు సాకులు చెబుతూ ప్రజాసంక్షేమానికి తూట్లు పొడిచారన్నారు. అర్థంలేని ఆంక్షలు విధించి సంక్షేమానికి అర్హులను దూరం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత మా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని కొనియాడారు. రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్త అకుంఠిత దీక్షతో పని చేసి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆయన కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు అంగూరి లక్ష్మీశివకుమారి, వాసిరెడ్డి జమీలు, మండల పార్టీ కన్వీనర్ సీహెచ్ వీవీ సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కాకి నాని, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సర్నం శ్రీను, పులి మధు, రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు చెన్నాడ సత్తిబాబు, రాష్ట్ర బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంకటరమణ, కేదారిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నానికి అభినందనలు



ఎ.మల్లవరంలో కాకి నానిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీశివకుమారి తదితరులు

రౌతులపూడి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమితులైన ఎ.మల్లవరం గ్రామానికి చెందిన కాకి లక్ష్మణరావు(నాని)కు మాజీ ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు అంగూరి లక్ష్మీశివకుమారి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం నానిను ఆయన స్వగృహంలో కలిసి బొకే అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా మండలంలోను, నియోజకవర్గంలోను సంస్థాగతంగా వివిధ పదవుల్లో నియమితులైన ప్రతి ఒక్కరికీ ఆమె అభినందనలు తెలిపారు. కష్టించి పని చేసిన కార్యకర్తలు, నాయకులకు పార్టీలో సముచిత స్థానం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు, పార్టీ పీఏసీ సభ్యులు ముద్రగడ పద్మనాభానికి, ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టించి పనిచేసే ప్రతి నాయకుడిని, కార్యకర్తలను పార్టీ అధిష్ఠానం గుర్తించడమే కాకుండా వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని, ముద్రగడ గిరిబాబును ఎమ్మెల్యేను చేసుకోవాలని ఆమె కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ నాకిరెడ్డి అప్పలనాయుడు, మండల కమిటీ సభ్యుడు బీమిరెడ్డి రామకృష్ణ, బొడ్డు నాని, గవిరెడ్డి రాజు, నాకిరెడ్డి గోవిందు, అడిగర్ల సత్యనారాయణ, పలివెల శివ తదితరులు పాల్గొన్నారు.

తాడిపెద్దు సంబరానికి విరాళం



తొండంగిలో కమిటీ సభ్యులకు విరాళం అంజేస్తున్న చందక లోవరాజు

తొండంగి: స్థానికంగా తాడిపెద్దు సంబరానికి బీసీ కాలనీకి చెందిన డాక్టర్ అనూషా యాదవ్ బుధవారం కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. గ్రామంలో తాడిపెద్దు ఇటీవల మరణించడంతో యాదవ సామాజిక వర్గానికి చెందిన కమిటీ సభ్యులు పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రూ.12,500 అనూషాయాద్ కుటుంబ సభ్యులు చందక లోవరాజు కమిటీ సభ్యులకు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈనెల 22 నుంచి తాడిపెద్దు సంబరాలు నిర్వహించనున్నారు. 23న భారీ అన్నసమారాధనకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బుద్దాల సత్యనారాయణ, పక్కుర్తి నాగబాబు, బారా బాబూరావు, ఇసరపు శ్రీను తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తుని రూరల్: హంసవరం సెక్షన్ పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కారానికి గురువారం తుని వీరవరపేట సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసినట్టు ట్రాన్స్‌కో అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటలు వరకు కన్స్యూమర్ గ్రీవెన్స్ అండ్ రెడ్రోసెల్ ఫోరం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం, లోఓల్టేజీ, బిల్లు సమస్యలు, కొత్త కనెక్షన్ జారీ తదితర అంశాలను సీజీఆర్‌ఎఫ్ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని హంసవరం విద్యుత్ సెక్షన్ ఆఫీసు వద్ద గురువారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్‌ఎఫ్) నిర్వహిస్తున్నట్టు జగ్గంపేట విద్యుత్ డీఈ డి.వీరభద్రరావు తెలిపారు. ఈ పరిష్కారవేదికలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, మీటరు లోపాలు, కాలిపోయిన మీటర్లు, ఓల్టేజీలో హెచ్చుతగ్గులు, సర్వీసు లోపాలు, కొత్త కనెక్షన్లు జారీలో ఆలస్యం, బిల్లుల్లో తప్పులు తదితర సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. హంసవరం సెక్షన్ ఆఫీసు వద్ద ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ నిర్వహించే సీజీఆర్‌ఎఫ్ జరుగుతుందని డీఈ వీరభద్రరావు సూచించారు.

మాదిగల పక్షపాతి మందకృష్ణ

ఎస్సీ వర్గీకరణపై హర్షం వ్యక్తం చేసిన మోషే



ఆరుగుల మోషే

కోటనందూరు: మాదిగల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ మాదిగల పక్షపాతి అని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే కొనియాడారు. బుధవారం కోటనందూరులో విలేకరులతో మాట్లాడుతూ మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వానికి తెలియజేసి వర్గీకరణను సాధించిన వ్యక్తి మందకృష్ణ అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దండోరా ఉద్యమాన్ని ఇంటింటా చేరవేసిన ఘనత దివంగత కొండేపూడి శ్యాంబాబుకు దక్కుతుందన్నారు. కోటనందూరు మండలంలో ఎమ్మార్పీఎస్ సేవలకు మరంత విస్తృతం చేసే దిశగా అడుగులేస్తున్నట్టు చెప్పారు. జులై 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాదిగ తండాల్లో జెండా దిమ్మలు ఏర్పాటు చేసి పార్టీ జెండాను ఎగుర వేసేందుకు ఏర్పాట్లు చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మాదిగ రక్షణ పోరాట సమితి మాదిగలకు అన్ని వేళలా అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోర్త మాణిక్యం, ఆరుగుల సత్తిబాబు, గెడ్డం శంకరయ్య, ఆరుగుల నూకయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో విద్యార్థుల యోగాసానాలు



కొత్తచోడిపల్లిపేట సముద్రతీరంలో యోగాసనాలు వేసిన పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు

తొండంగి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కొత్త చోడిపల్లిపేట సముద్ర తీరంలో యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ ఆధ్వర్యంలో యోగా శిక్షకుల పర్యవేక్షణలో పలు యోగాసనాలు వేశారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా సంపూర్ణారోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత, జ్ఞాపకశక్తి, సమస్యా పరిష్కార సామర్థ్యం ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు దివాకర్, పి.వి.కృష్ణారావు, జగదీష్, ప్రకాష్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తుని రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తుని మండలం డి.పోలవరంలో నూతనంగా నిర్మించిన రహదారిని ఎమ్మెల్యే యనమల దివ్యతో కలసి ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీఒక్కరు యోగాను విధిగా అభ్యసించాలన్నారు. డాక్టర్ పలకా సోమేశ్వరరావు, దండెం రామకృష్ణ, అలమండ వెంకటరమణ, వాడబోయిన సాంబయ్య, పెనుపోతుల నూకరాజు, పాల్గొన్నారు.

అడవి కాదిదీ.. పట్టణ ప్రాంతమే..



రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలు

ఏలేశ్వరం: ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల ప్రాంతం అనుకుంటే పొరపాటు పడినట్టే. ఇది ఏలేశ్వరం నగర పంచాయతీలోని షిర్డినగర్‌లోని గాంధీజీ విగ్రహం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి. రహదారికి ఇరువైపులా తుప్పలు, మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. రహదారికి ఇరువైపులా ఉన్న వీటిని తొలగించాలని అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్నా దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి ఇదే పరిస్థితి కొనసాగడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలకు ఇబ్బంది మారింది. ఈ రహదారి మీదుగా మహిళలు, పిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి

శంఖవరం: విద్యతోనే దేశాభివృద్ధి అని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. కత్తిపూడి జెడ్పీహైస్కూల్లో పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్ని వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాన్ని అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నా శివ, బద్ది రామారావు, పర్వత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తొండంగి: ఎల్లయ్యపేట శివారులో బుధవారం ఓ ప్రైవేట్ హేచరీలో వర్కర్ల కోసం వంట చేస్తుండగా గ్యాస్ స్టౌవ్ నుంచి మంటలు వచ్చి ముగ్గురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో ఎస్ అండ్ ఎస్ హేచరీలో సిబ్బంది కోసం వంట చేస్తుండగా గ్యాస్ పొయ్యి నుంచి మంటలు చెలరేగాయి. దీంతో వంట చేస్తున్న ఎల్లయ్యపేటకు చెందిన సూరాడ అనంతలక్ష్మితోపాటు హెల్పర్లు పంపాలిపేటకు చెందిన కుందేటి వీరబాబు, దండేపల్లి మండలం ఎర్రంపాలెం గ్రామానికి చెందిన వజ్రపు నానిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కాకినాడ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని తొండంగి పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు: ఒమ్మంగిలోని 11 కేవీ ఫీడర్ పరిధిలో కొత్త లైన్లు పునరుద్ధరణ పనుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫీడర్ పరిధిలోని ఒమ్మంగి, రాచపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు.

అమరుల స్థూపం ఆవిష్కరణ



రామవరంలో స్థూపాన్ని ఆవిష్కరించిన పార్టీ నేతలు

జగ్గంపేట: జిల్లాలో రైతు కూలీ సంఘం నేత, విప్లవోద్యమంలో అలుపెరగని పోరాటంలో అశువులు బాసిన సీపీఐ, ఎంఎల్, జనశక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ప్రసాద్, ఆయన భార్య పీఓడబ్ల్యూ స్త్రీ విముక్తి నాయకురాలు వసంత అక్కల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు ఆనంద్ అన్నారు. కామ్రేడ్ ఎంవీ ప్రసాద్, వసంత అక్కలు అమరులై నేటికి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జగ్గంపేట-రామవరం గ్రామాల మధ్య ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం భూములలో వారి పేరిట నిర్మించిన స్థూపాన్ని ఆనంద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రసాద్, వసంత అక్కల పోరాటాలను కొనియాడారు. స్థూపం ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ గ్రామాల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎం.ఎల్ జిల్లా కమిటీ సభ్యులు, పీఓడబ్ల్యూ స్త్రీ విముక్తి నేతలు బోలే ప్రభాకర్, జె.కృష్ణ, సిల్లీ రాంబాబు, వెలుగుల జయక్క, నైనపు చంద్రమ్మక్క, సరిసే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుష్కర కాలువ పూడిక తీత పనులు



పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్: మండలంలో ఉన్న పుష్కర కాలువ పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టారు. రూ.80 లక్షలతో చేపట్టే పూడికతీత పనులకు తుని మండలం వల్లూరు, ఎస్.చామవరం మధ్య ఎమ్మెల్యే యనమల దివ్య యంత్ర పూజ చేసి ప్రారంభించారు. తేటగుంట, టి.తిమ్మాపురం, హెచ్.కొత్తూరు, హంసవరం, వల్లూరు, ఎస్.చామవరం, ఎస్.అన్నవరం పరిధిలో శివారు భూములకు సాగునీరు చేరనుంది. రూ.40 లక్షలతో వల్లూరు, ఎ.అగ్రహారం మధ్య అభివృద్ధి చేసిన రహదారిని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, నాయకులు సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, కుర్ర వెంకటరమణ, కరపా అప్పారావు పాల్గొన్నారు.

జనసేన నాయకుల అలక

శంఖవరం: కత్తిపూడిలో బుధవారం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు జనసేన నాయకులకు పిలుపు లేకపోవడంతో అలక వహించారు. కత్తిపూడి జెడ్పీహైస్కూల్లో పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అయితే జనసేన పార్టీ నేతలకు పిలుపు లేకపోవడంతో వారు బాహటంగానే విమర్శలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ చిట్టాపట్టాలు వేసుకు తిరిగే టీడీపీ జనసేన మధ్యవిభేదాలు పొడచూపాయి.

గ్రామ సచివాలయం సిబ్బంది ప్రవర్తనపై ప్రజల మండిపాటు



మల్లేపల్లి సచివాలయం-1లో సాయంత్రం 4 గంటలకే ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

గండేపల్లి: గ్రామ సచివాలయ సిబ్బంది కార్యాలయానికి సమయానికి హాజరుకాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యలపై వచ్చిన అర్జీదారులు వెనుదిరగాల్సి వస్తోందని, అంతేకాక వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని మండిపడుతున్నారు. సచివాలయం విధులకు ఉదయం 10.30 గంటలకు హాజరుకావాల్సి సిబ్బంది ఆలస్యంగా రావడంతో పనుల కోసం వచ్చిన అర్జీదారులు సిబ్బంది కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం 5 గంటల వరకు ఉండాల్సిన సిబ్బంది 4 గంటలకే వెళ్లి పోవడంతో పొలం, ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లిన అర్జీదారులు సాయంత్రం సచివాలయానికి వచ్చే సరికి వారి అవసరాలు తీర్చే శాఖల సిబ్బంది కానరాకపోవడంతో తమ పనులు మానుకుని మరుసటి రోజు కార్యాలయానికి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పనిని పట్టించుకోకపోవడమే కాకుండా దురుసుగా, హేళన చేస్తూ మాట్లాడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. మల్లేపల్లి సచివాలయం-1, నీలాద్రిరావుపేట సచివాలయం-2 తోపాటు మరి కొన్ని గ్రామాలలో సచివాలయ సిబ్బంది ఇదే తరహాలో వ్యవహరిస్తున్నట్టు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మల్లేపల్లి సచివాలయం-1లోని కొన్ని శాఖల సిబ్బంది బుధవారం 4 గంటలకే వెళ్లి పోయినట్టుగా గ్రామస్తులు చెబుతున్నారు. నీలాద్రిరావుపేట సచివాలయం-2కి ఆధార్ సవరణ నిమిత్తం వచ్చిన అర్జీదారుడు ఇబ్బందులు పడినట్టు తెలియజేశారు. సచివాలయాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.